# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్థం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్థంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్థం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్థిక్కూడా సులభంగా అర్థం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# ౯ వ భాగం

## అంబరీషోపాఖ్యానం - 1

క. **శ్రీరాజిత! మునిపూజిత!**

**వారిధి గర్వాతిరేక వారణ బాణా!**

**సూరిత్రాణ! మహోజ్జ్వల**

**సారయశస్సాంద్ర! రామచంద్ర నరేంద్రా!** [9-1]

పోతన భాగవతం నవమ స్కంధంలో మొదటిదీ కంద పద్యం. ఏ స్కంధం మొదలు పెట్టినా ముందో పద్యం రాముడుకి అని చెప్పుకున్నాం కదా? అలా ఇదీను. ఇటువంటి పద్యాలకి అసలు అర్థం చెప్పడం అనవసరం ఎందుకంటే పోతన ద్రాక్షాపాకం ఎంత సులభంగా ఉంటుందో ఇవి చెప్పకనే చెప్తాయి. భగవంతుడ్ని సర్వకాలాల్లోనూ గుర్తుంచుకునేవార్ని ఏమీ అడగకుండానే ఆయన ఎలా కాపాడతాడో చెప్పేదే ఈ అంబరీషోపాఖ్యానం. గజేంద్రమోక్షంలో ఇంద్రద్యుమ్న మహారాజు భగవంతుడ్ని మర్చిపోయి చివరిదాకా పోరాటం సాగించి అప్పుడు శరణువేడాడు. అయితే ఇందులో శరణు అని అడగడమే లేదు ఎందుకంటే, "సాధుల హృదయము నాయది; సాధుల హృదయంబు నేను" అని ఆయనే చెప్తున్నాడు.

సీ. **చిత్తంబు మధురిపు శ్రీపాదముల యంద;**

**పలుకులు హరిగుణపఠనమంద;**

**కరములు విష్ణుమందిర మార్జనములంద;**

**శ్రవములు హరికథాశ్రవణమంద;**

**చూపులు గోవింద రూపవీక్షణమంద;**

**శిరము కేశవ నమస్కృతుల యంద;**

**పదము లీశ్వరగేహపరిసర్పణములంద;**

**కామంబు చక్రికైంకర్యమంద;** [౯-౮౨]

తే. **సంగ మచ్యుతజన తనుసంగమంద;**

**ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద;**

**రసనఁ దులసీదళములంద; రతులు పుణ్య**

**సంగతుల యంద యా రాజచంద్రమునకు.** [9-82.1]

మహాభాగవతం నవమస్కంధంలో వచ్చే కథ అంబరీషుడిది. అంబరీషుడు సూర్యవంశంలో పుట్టిన నాభాగుడి కొడుకు. ఆయన ఎటువంటివాడంటే, సప్త ద్వీపాలకీ రాజై ఉండి కూడా ఏమాత్రం అహంకారం లేని పరమ భాగవతోత్తముడూ, విష్ణుభక్తుడూను. శరీరం, మనస్సూ శ్రీహరికి అర్పించినవాడాయన. చేతులు, కళ్ళు, చెవులు, ముక్కూ అన్నీ ఆయనకే అర్పించేడు.

క. **హరి యని సంభావించును;**

**హరి యని దర్శించు; నంటు; నాఘ్రాణించున్;**

**హరి యని రుచిగొనఁ దలఁచును;**

**హరిహరి; ఘను నంబరీషు నలవియె పొగడన్?** [9-86]

ఏదైనా చూసేముందు 'హరి' అంటాడుట. ఏదైనా తినేటప్పుడు కూడా 'హరి ' అంటాడుట. అంటే సర్వకాల సర్వావ్యవస్థల్లోనూ భగవంతుడ్ని గుర్తుపెట్టుకుని ఉన్నాడన్న మాట. అటువంటువాడ్ని భగవంతుడు కూడా అంతే ప్రీతితో రక్షిస్థాడు కదా? ఇటువంటి అంబరీషుడ్ని మనం పొగడగలమా అంటున్నాడు పోతన.

వ. అంతఁ గొంతకాలంబున కమ్మేదినీకాంతుండు సంసారంబువలని తగులంబు విడిచి నిర్మలుండై యేకాంతంబున భక్తిపరవశుండై యుండ నా రాచతపసికి భక్తలోకవత్సలుండగు పురుషోత్తముండు ప్రతిభటశిక్షణంబును, నిజజనరక్షణంబును, నిఖిలజగదవక్రంబును నగు చక్రంబు నిచ్చి చనియె; అంత. [9-89]

ఇలా ఉండగా అంబరీషుడి భక్తికి మెచ్చి విష్ణువు ఆయనకి తన చక్రాన్ని రక్షగా ఇచ్చాడు. ఎందుకనేది తెలుసుకోవాలంటే కొంచెం ఆగి ఆలోచించాలి.

ప్రపంచంలో మనకి తెల్సినది ఎంత? నాకు ఇది తెలుసు అనేలోపుల, నా పక్కనే ఉన్నతను, "దాని గురించి నాకు ఇంకా బాగా తెలుసు" అనేస్తున్నాడే? అంటే తాడి తన్నేవాడి తలకాయ తన్నేవాడు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాడు. కానీ మనందరికీ అన్నీ పూర్తిగా తెలుసా? ఎంత తెల్సుకున్నా ఏదో మిగిలిపోతోంది. హిగ్స్ బోసాన్ లాంటి డివైన్ పార్టికిల్ తెల్సినా ఇంకా తెలియవల్సింది ఏదో ఉండిపోయిందే? అయితే హిమాలయాల్లో ఎవరికీ కనపడని గుహల్లో చీకూ చింతా లేకుండా కూర్చుని తపస్సు చేసుకునే ఋషులకి అలాంటి బ్రహ్మ వర్చస్సు ఎలా సాధ్యం అవుతోంది? అయిదో క్లాసు కూడా చదువుకోని రామకృష్ణ పరమహంసా, స్వామి వివేకానందులూ, బుద్ధుడూ వాళ్ళుపోయి వంద(ల) సంవత్సరాలౌతున్నా వాళ్ళ అస్తిత్వం ఇంకా ఎలా నిలుపుకోగలిగేరు? దీనికేదో ప్రబలమైన కారణం ఉండుండాలే? దీన్నే మనవాళ్ళు బ్రహ్మ జ్ఞానం అన్నారు. అది ఎటువంటిది? 'ఏది తెలుసుకంటే ఇంకేమీ తెలుసుకోనక్కరలేదో, ఏది తెలిస్తే అన్నీ తెలుస్తాయో అదే బ్రహ్మ జ్ఞానం' అంటారు శివానంద సరస్వతి (Realize the Brahman or the Absolute the attainment of which leaves nothing more to be attained, the blessedness of which leaves no other blessing to be desired, the knowledge of which leaves nothing more to be known). ఆ జ్ఞానం నిత్యం ఉన్నవాడే భగవంతుడు. అంటే ఆయనకి భూత భవిష్యత్ వర్తమానాల్లో ఎప్పుడు, ఎక్కడ ఏమి ఎలా జరుగుతుందో పూర్తిగా తెలుసు. అవి అలా జరగడానికి కారణం కూడా ఆయనకి తెలుసు. వాటి వల్ల వచ్చే ఫలితాలు కూడా బాగా తెల్సినవాడు ఆయన. ఆయన స్థాయికి వెళ్తే మనకీ అన్నీ తెలుస్తాయి.

అంబరీషుడికి ఈ చక్రం ఎందుకు రక్షగా ఇచ్చాడంటే భగవంతుడికీ ఈ భూత భవిష్యత్ వర్తమానాలు బాగా అవగాహన ఉండడం వల్లే. అంబరీషోపాఖ్యానం చివర్లో మళ్ళీ చూద్దాం దీని గురించి.

క. **తన తోడినీడ కైవడి**

**ననురూప గుణాఢ్య యైన యాత్మమహిషితో**

**జనవిభుఁడు ద్వాదశీవ్రత**

**మొనరన్ హరిఁగూర్చి చేసె నొక యేఁ డధిపా!** [9-90]

అయితే చక్రం తన రక్షలోకి రాగానే పేట్రేగిపోయి ఒక్కో రాజ్యం మీదకి దండెత్తుకుపోలేదు అంబరీషుడు. అధికారం ఉంది కదా నన్ను ఎవడేంచెయ్యగల్డు అనీ అనుకోలేదు. పూర్వంలాగానే ఉన్నాడు. అటువంటివాడని తెలుసుకనకే అసలు విష్ణువు చక్రం రక్షగా ఇచ్చాడు. ఇలా భగవంతుడి కరుణ ప్రసరించాక ఈ భాగవతోత్తములు ఏం చేస్తారంటే ఇంకా ఎక్కువగా భగవంతుడి సేవలో గడుపుతూ ఉంటారు. ఎందుకంటే ఇదొక వలయం. ఎంత అణుకువగా ఉంటే అంత భగవత్కృప లభిస్తుంది. అది వచ్చాక ఇంకా అణుకువగా ఉంటారు. అప్పుడు మరింత కరుణ, అలా ఒకదాని వెంబడి మరోటి వస్తూ భక్తుడు భగవంతుడికి చేరువగా వస్తాడు. (Faith brings grace. Grace manifests itself as experience of His Presence. His saving grace further augments faith. Thus the devotee ascends the spiritual ladder till he experiences His omnipresence, omnipotence and omniscience – Sivananda Saraswati, Divine Life Society). నాన్యః పంథా విద్యతే అయనాయ. వేరు దారి లేదు. ఈ కారణంగానే అంబరీషుడు ద్వాదశీ వ్రతం మొదలు పెట్టాడు.

వ. ఇట్లు వ్రతంబు చేసి, యా వ్రతాంతంబునం గార్తికమాసంబునమూఁడు రాత్రు లుపవసించి, కాళిందీజలంబుల స్నాతుండయి,మధువనంబున మహాభిషేక విధానంబున విహిత పరికరసుసంపన్నుండయి, హరి నభిషేకంబు జేసి, మనోహరంబులయిన గంధాక్షతంబులు సమర్పించి యభినవామోదంబులైన పుష్పంబులం బూజించి తదనంతరంబ. [9-91]

ఎటువంటి సమయంలో చేసాడు వ్రతం? భగవంతుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో. మూడు రోజులు ఉపవాసం చేసేడు ఈ వ్రతంలో మళ్ళీ.

శా. **పాలేఁతై ప్రవహింప నంగరుచులం బ్రాయంబులున్ రూపము**

**ల్మేలై ధూర్తులుగాక వెండిగొరిజ ల్హేమోరు శృంగంబులుం**

**గ్రాలం గ్రేపుల యఱ్ఱు నాఁకుచును రంగచ్చేలలై యున్న మం**

**దాలన్ న్యర్బుదషట్క మిచ్చె విభుఁ డుద్య ద్వైదిక శ్రేణికిన్** [9-92]

ద్వాదశీ వ్రతం ఒక ఏడాది పాటు అయ్యాక ముగించే ముందు భూరిదానాలు ఇచ్చాడు. అందులో ఇచ్చిన గోవులు ఎటువంటివో చెప్తున్నాడు చూడండి. వట్టిపోయిన పనికిరాని ఆవులు కాదు. పాలేరై ప్రవహించేవి. అస్సలు ఎవరినీ పొడిచేవి కాదు. వెండి కాలి గిట్టలూ, బంగారం కొమ్ములూ ఉన్నటువంటి గోవులని దానమిచ్చాడు. ఎన్ని గోవులో చెప్తున్నాడు చూడండి – అర్బుద షట్కం. అంటే ఆరువందల కోట్లు. ఎవరికిచ్చాడు? వేదజ్ఞానముగల విప్రులందరికీ ఇచ్చాడు.

ఇచ్చేటప్పుడు ఎలాంటివిస్తే కీర్తి కల్గుతుందో చెప్తున్నాడు ఈ పద్యంలో. చిన్న పిట్ట కథ ఇక్కడ. మనం ప్రపంచానికేది ఇస్తామో దానికి రెట్టింపు మనకి వెనక్కి వస్తుంది అని చెప్తూ ఉంటారు. ఒకసారి రామకృష్ణ మిషన్ కి వెళ్ళి 'ఏమండి నా దగ్గిర కొన్ని వాడేసిన బట్టలు ఉన్నాయి. అవి మీకిస్తే మీరు ఎవరికేనా పేదలకి ఇస్తారా?' అని అడిగేను తెలివిగల వాడిలాగా, ఏదో పెద్ద దానం చేసేస్తూన్నట్టూ పోజు పెట్టి. అక్కడున్న స్వామిగారు నాకేసి ఓ చూపు చూసి ఇలా చెప్పేరు "మేము ఇక్కడ ఎవరికీ ఏదీ వాడేసినది ఇవ్వము. అన్నీ కొత్తవే ఇస్తాము. మీరు కొత్తవి తెస్తే తప్పకుండా తీసుకుంటాము. ఈ మధ్య వరదల్లో చాలామందికి ఇల్లూ వాకిలీ పోగుట్టుకున్నారు. వాళ్ళకి కొత్త ఇళ్ళు కట్టించి ఇచ్చాము. బట్టల షాపులోంచి పంచెలూ, చీరలూ చెప్పించి ఇచ్చాము." అన్నారు. మొహం ఎక్కడ పెట్టుకోవాలో తెలియక నేల చూపులు చూస్తూంటే ఇంకా ఇలా అన్నారు నవ్వుతూ "మీకు ఎవరేనా వాడేసిన బట్టలు ఇస్తే తీసుకుంటారా? మీకు ఏది కావాలని అనుకుంటున్నారో అలాంటిదే మీరు అందరికీ ఇవ్వాలి. అయినా మనందరికీ ఇచ్చేది భగవంతుడైనప్పుడు అలా వాడేసినవి ఇద్దాం అని ఆలోచించకూడదు."

పెద్ద గుణపాఠం నేర్చుకున్నాను ఆ రోజున. పోతన సరిగ్గా ఇదే చెప్తున్నాడు ఈ పద్యంలో. ఇచ్చేది ఎప్పుడూ మంచిదై ఉండాలి. అలా ఇస్తే భగవంతుడు సంతోషిస్తాడు కానీ పనికిరానివీ, పారేసేవీ ఇస్తే మనకి భగవంతుడు కూడా అలాంటివే ఇస్తాడు. బిల్ గేట్స్ తన సంపద దాదాపు ప్రజలకోసం ఖర్చుపెట్టడానికి ఒక వ్యవస్థ పెట్టాడు. ఏమైంది వెంటనే? తను ఎంత ఇచ్చాడో దానికి సమానమైన సంపద వారెన్ బఫెట్ గారు ఇవ్వలేదూ? 'మీరు ఇవ్వండి అది అనంతమై మీ దగ్గిరకే వస్తుంది మళ్ళీ' అనే శివానంద సరస్వతి గారి సూక్తి ఎంత నిజమో గమనించారా? అందుచేతనే బలి చక్రవర్తీ, అంబరీషుడూ, శిబి ప్రముఖులందరూ ఇవ్వడానికే మొగ్గు చూపుతారు తప్ప, తీసుకోవడానిక్కాదు. తీసుకోవడంలో పెద్దగా నేర్చుకుందుకేముంది? నేర్చుకునేది ఏమైనా ఉంటే అది ఇవ్వడంలో ఉండాలి గానీ.

క. **పెక్కండ్రు విప్రవరులకు**

**గ్రక్కున నతిభక్తితోడఁ గడుపులు నిండం**

**జొక్కపు టన్నంబిడి విభుఁ**

**డొక్కెడఁ బారణము చేయ నుద్యోగింపన్.** [9-93]

అప్పుడు ఇంకా సంతోషించలేదు అంబరీషుడు. దానాలిచ్చాక కూడా వాళ్ళందరికీ భోజనాలు పెట్టించి, అందరూ సంతృప్తులయ్యేక తాను వ్రతం సమాప్తి కోసం ఉపవాస దీక్ష విరమించడానికి పారణ చేయడానికి కూర్చోబోయేడు. ఇక్కడ్నుంచి అసలు కథ మొదలౌతోంది.

క. **భాసుర నిగమ పదోప**

**న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమ యోగా**

**భ్యాసుఁడు రవిభాసుఁడు దు**

**ర్వాసుఁ డతిథి యయ్యెఁ దన్నివాసంబునకున్.** [9-95]

సరిగ్గా ఈ పారణ మొదలు పెట్టేసరికి వచ్చాడు దూర్వాసుడు. ఆయన ఎటువంటివాడంటే నిరంతరం యోగాభ్యాసం చేసేవాడు, మంచి తపశ్శక్తి ఉన్నవాడూను. మనం ఏదైనా మంచి పని చేస్తుంటే ఇలా ఎవరైనా యోగి పుంగవులొస్తే ఏం చేస్తాం?

వ. అట్లతిథి యై వచ్చిన న మ్మునివల్లభునకుఁ బ్రత్యుత్థానంబు చేసి,కూర్చుండ గద్దియ యిడి పాదంబులు గడిగి పూజించి క్షేమం బరసి తన యింట నన్నంబు గుడువు మని నమస్కరించిన న మ్మహాత్ముండు సంతసించి భోజనంబునకు నంగీకరించి, నిర్మలంబులగు కాళిందీజలంబులం బరమధ్యానంబు చేయుచు, మునింగి లేచి రాక తడవు చేసిన, ముహుర్తార్ధావశిష్ట యగు ద్వాదశి యందుఁ బారణ చేయవలయుటఁ జింతించి బ్రాహ్మణాతిక్రమదోషంబునకు శంకించి విద్వజ్జనంబుల రావించి వారల నుద్దేశించి. [9-96]

కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిమీద చల్లుకుని, చెప్పేడు అంబరీషుడు. "చాలా సంతోషం, మీరు సరైన సమయానికి వచ్చారండి, రండి కల్సి భోజనం చేద్దాం, ఇప్పుడే పూజా అదీ పూర్తి అయింది", అన్నాడు. ఈ దూర్వాసుడు మామూలు వాడా? అందర్నీ పరీక్ష చేస్తూ ఉంటాడు. ఆయనకి కోపం వస్తే శపిస్తాడు కూడాను. ఎప్పుడాయనికి కోపం వస్తే అప్పుడు చటుక్కున శపించేస్తాడు. అంచేత అందరూ భయంతో జాగ్రత్తగా ఉంటారు. "సరే అయితే భోజనం చేస్తాను కానీ ఇప్పుడు వెళ్ళి కాళిందీ నదిలో స్నానం చేసి వస్తాను" అని బయల్దేరి వెళ్ళాడు. అంటే అర్థం ఏమిటంటే 'నేను వచ్చేదాకా ఉండూ' అని కదా? దూర్వాసుడికి కోపం ఎటువంటిదో అంబరీషుడికి వినయం అటువంటిది. "సరే తప్పకుండా వెళ్ళి రండి. నేను మీ గురించి చూస్తూ ఉంటాను." అన్నాడు. కానీ వెళ్ళినవాడు ఎంతకీ రాడే? ఈ లోపుల ద్వాదశీ ఘడియలు

వెళ్ళిపోతున్నాయి. ఇటు పారణ చేయకపోతే వ్రతం ఫలితం దక్కదు. అటు ముని రాకుండా భోజనం చేస్తే పాపం వస్తుంది. అదీగాక వచ్చినవాడు దూర్వాసుడు. శపిస్తాడేమో? ఏం చేయ్యాలి?

క. **ముని నీరు జొచ్చి వెడలడు**

**చనియెడు ద్వాదశియు నింత చనియె న్నీలో**

**నన పారణయున్ వలయును**

**వినిపింపుం డర్థధర్మవిధ మెట్టిదియో?** [9-97]

తనకి ఎప్పుడూ ఎదురవ్వని ధర్మ సంకటం సిద్ధించింది. అంచేత ధర్మం తెల్సిన వాళ్ళని పిల్చి అడిగేడు, "ఇదిగో ఇలా ఈయన స్నానాకికెళ్ళాడు. ద్వాదశీ ఘడియలు వెళ్ళిపోతున్నాయి. పారణ చేయకపోతే వ్రతం చెడుతుంది. చేస్తే పాపం చుట్టుకుంటుంది. మీరు చెప్పండి ఏది ధర్మ సమ్మతమో."

విష్ణువు నాకు చక్రం ఇచ్చాడు నన్నెవడూ ఏమీ చెయ్యలేడు, నేను చేసేదే ధర్మం అని అనుకోలేదు. ఎందుకంటే అంబరీషుడు హరి భక్తుడూ, అత్యంత వినయం కలవాడు కనక. అప్పట్లో ఉన్న ధర్మం ఎటువంటిదీ, అంబరీషుడు అడిగితే ఈ విప్రులందరూ ఏం చెప్పారూ, ఆ తర్వాత ఏమైందీ వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS